


నీలమణి గురించి రాయాలంటే మెడికల్ కాలేజీలో నా మొదటి రోజు అనుభవందగ్గర నుంచి రాయాలి. రాగ్ చేస్తున్న సీనియర్స్ నుంచి తప్పించుకుని ఎలాగో లెక్చర్ గాలరీలోకి ప్రవేశించి "అమ్మయ్య" అని వూపిరి పీల్చుకుందా మనుకుంటే వూపిరి ఆడలేదు. ఎందుకంటే ఆగాలరీలోంచి గాలి లోపలికి రావడం కాని బయటకు పోవడం కాని జరగదు. కరెంటులేని కారణంగా దీపాలు కూడా వెలగటంలేదు. విద్యార్థు లందరూ భయం భయంగా పక్కవాడికేసి చూస్తున్నారు. మొత్తానికి అక్కడి వాతావరణం విప్లవకారుల రహస్య సమావేశాని పోలి ఉంది. ఇంతట్లోనే ఒకవ్యక్తి ఓవరాల్ వేసుకుని చేతిలో పొడుగాటి పుస్తకాన్ని పట్టుకుని వచ్చాడు. అందరూ లేచి నిలబడ్డారు. ఆ వ్యక్తి నవ్వేసి ఆ పుస్తకాన్ని అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడు. (తర్వాత తెలిసింది అతను అటెండరని).

ఇంతట్లోనే లెక్చరరుగారొచ్చేశారు. అంతవరకూ వూపిరి పీల్చుకుందామని ప్రయత్నిస్తున్న వాళ్ళందరూ ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆయన అటెండెన్సు తీసుకోవడం మొదలు పెట్టారు: నేను బిగుసుకు పోయాను. నా పేరు అప్పుడే రాదని తెలిసి నప్పటికీ ప్రతిపేరు చెవులు రిక్కించి విన్నాను. చివరకు నా పేరు వచ్చింది. "యస్సర్" అని అతికష్టంగా గట్టిగా వూపిరి పీల్చుకున్నాను.

"నీలమణి! లెక్చరరు తలెత్తి అమ్మాయిలకేసి చూసి మళ్ళీ పిలిచారు. ఎవరూ పలకలేదు.

"నీరజ!"

"యస్సర్"

క్లాసంతా అటువేపే చూశారు. ఆ చీకట్లో ఆమె ఒక మెరుపులా మెరిసింది. అప్పుడే రిలాక్సవడం మొదలు పెట్టిన నా ఒళ్ళు మళ్ళీ బిగుసుకుపోయింది. కారణం అంతందమైన అమ్మాయిని నేనంత వరకూ చూడలేదు. ఏ చిత్రకారుడు ఆమెని చిత్రించడానికి ముందుకురాడు. ఎందుకంటే అంత అందాన్ని చిత్రించలేనని భయపడి.

తర్వాత నేను మరెవరి పేరూ కానీ, లెక్చరరు చెప్పిన నీతివాక్యాలుకాని వినలేదు. అలా ఆ అమ్మాయి కేసే చూస్తూ కూర్చున్నాను. మరో రెండురోజులు గడిచాయి. నీలమణి ఎవరోకాని ఇంకారాలేదు. ఎవరో ఆ అమ్మాయి ఎలా ఉంటుందోనన్న కుతూహలం నాలో పెరగడం ప్రారంభించింది. నీలమణి పేరు అనేక రూపాంతరాలు చెందింది. కొందరు లెక్చరర్లు "నీలామణి" అని, మరికొందరు "నీల్ మణి" అని ఇలా చిత్ర విచిత్రంగా పిలిచేవారు.

* * * *

అటెండెన్సు పలికే అమ్మయ్య అనుకుంటూండగా క్లాసులో నవ్వులు చెలరేగాయి. "ఏమిటేమిటి?" పక్కనున్న దళసరి కళ్ళద్దా లబ్బాయిని అడిగాను.

"నీలమణి వచ్చాడు" అన్నాడతను అదోలా నవ్వుతూ.

అప్పుడు చూశాను మా ముందర బెంచీలో నిల్చుని ఉన్నతన్ని.

"యువార్ నాట్ ఎ గాల్" అంటున్నాడు కుర్ర లెక్చరరు నవ్వుతూ.

"నో సర్—ఐయామె బాయ్". అంటున్నాడా కుర్రాడు అమాయకంగా, అయోమయంగా. అతన్ని గుర్తు పట్టాను నేను. అతను అంతకు ముందు రోజు రాత్రి నా రూమ్‌కు వచ్చిన వ్యక్తి. నీరజ కేసి చూశాను. నీరజ పడిపడి నవ్వుతూంది.

రాత్రి సంఘటన గుర్తు కొచ్చింది. రాగింగు నుంచి కష్టపడి తప్పించుకుని రూములో లైటు ఆర్పేసి పడుకున్నాను. దాదాపు పదిగంటల ప్రాంతంలో ఎవరో తలుపు కొట్టారు. నేను కదలకుండా పడుకున్నాను. మళ్ళీ కొట్టారు, మళ్ళీమళ్ళీ కొట్టారు. లేచివెళ్ళి తలుపు తీశాను. ఎదురు గుండా నా వయసే ఉన్న ఒక కుర్రాడు నిలబడి ఉన్నాడు. అతని జుట్టు బాగా చెరిగిపోయి ఉంది. ముఖంలో బాగా అలసట కనిపిస్తూంది. కళ్ళు అమాయకంగా చూస్తున్నాయి. అప్పుడు చూశాను అతని చేతిలో ఉన్న పాత ట్రంకు పెట్టెని.

"సార్! ఇదేనా రూం నెంబరు రెండొందల పందొమ్మిది" అన్నాడతను.

"అవును" అన్నాను అర్థంకాక.

"నాకుకూడ ఈరూమ్ ఎలాట్ చేశారు."

"లోపలికి రండి" అన్నాను అడ్డు తప్పుకుంటూ

అతను లోపలికి వచ్చి పెట్టె ఒక వారగా పెట్టాడు. "టైమెంతయిందండీ?" అని అడిగాడు.

"ఐదు నిమిషాల తక్కువ పది."

"అబ్బ హోటల్ కట్టేస్తాడేమో నేను త్వరగా వస్తానండి" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

నేను తలుపు గడియవేసి వచ్చి పడుకున్నాను. అతను రాత్రి మళ్ళీ రాలేదు. వస్తాడని నేనూ అను కోలేదు. ఎవరో సీనియర్ పట్టుకెళ్ళిపోయి ఉంటాడు అనుకున్నాను.

• • •

ఆనాటి నుంచి ఈనాటి వరకూ నాకూ, నీల మణికీ మధ్య జరిగిన సంఘటనలను కథగా రాస్తే ఎన్ని వందల పేజీలవుతుందో నేను వూహించలేను. నీలమణి అందరి లాంటి వాడు కాదు. ఆ విషయం నేను మొదటే గ్రహించాను. నీలమణి అమాయ కుడు, మంచివాడు. అన్నిటి కంటే ముఖ్యం నీల మణికి నేటి సమాజంలో అతిసామాన్యమై పోయిన హిపోక్రసీ తెలియదు.

ఆవేళ క్లాసయిపోయిన తర్వాత ఎవరో నా సీని యర్ పిలుస్తాడేమోనని తలవంచుకుని వెళ్ళి పోతుంటే "సార్ సార్" అని పిలుపు వినబడి వెనక్కి తిరిగాను. నీలమణి గబగబ నడుచుకుంటూ నాకేసి వస్తున్నాడు.

"సార్! మీపేరేమిటి?"

చెప్పాను.

"నాపేరు నీలమణి—నిన్న కంగారులో చెప్పడం మర్చిపోయాను. ఏమనుకోలేదు కదా?" అన్నాడతను తడబడుతూ.

"అబ్బే పర్వాలేదు లెండి. ఇంతకీ రాత్రి హోటల్ కట్టెయ్యకుండా వెళ్ళారా?" అన్నాను ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని.

"హోటల్ కట్టెయ్యలేదుకాని. . ."

"ఏం అయింది?"

"నేను జేబులో డబ్బు తేసుకోవటం మరిచి పోయాను. పెట్లో ఉండిపోయాయి. అర్ధరూపాయే ఉంది. అరటి పళ్ళు తిని హాస్టలు కొచ్చాను. నాటు ఇరవయ్యేకటాయన తీసుకెళ్ళి పోయాడు. అక్కడి నుంచి పాటమెప్పి, నాటవలబై అరుకవాడా వెళ్ళాల్సొచ్చింది. చివరికి ఐదు గంటలకి నాటవలబై నాలుగులో పడుకున్నాను. అతను చాలా మంచతను. ఇంతకీ రాత్రి మీరెక్కడికివెళ్ళలేదా?" హటాత్తుగా అడిగాడు.

"లేదు. ఎలాగో తప్పించుకున్నాను."

"అదృష్టవంతులు" అని వెటకార్చి, "నాట వలబై నాలుగతను చాలా మంచివాడు—ఫిజిక్స్ పుస్తకా లిస్తానన్నాడు."

ఇంకా ఏదో చెప్పబోయేంతలో ఎవరో సీనియర్ అమ్మాయిలు పిలిచారు.

వెళ్ళాం. వెళ్ళక తప్పదు.

"మీ పేరేమిటి?" అడిగిందో ఎత్తు పళ్ళ అమ్మాయి.

"నీలమణి".

కొంచ ముసిరింది. "పేరంటే అసలు పేరు చెప్పకూడదు. వాళ్ళు పెట్టిన నిక్ నేమ్ చెప్పాలి.

"పేరేం పెట్టలేదా?"

నీలమణి తడబడ్డాడు—"బుద్ధావతారం".

"కాదు. ఆ దారక్కాని మార్చుకో." ఒక మగ రాయుళ్ళా ఉన్నమ్మాయి గర్జించింది.




"మార్చుకుంటావా?" మరో కంఠం అడిగింది. అంతకంతలో ఒకు సంతోషం ఉంది — నాకు రాగింగ్ తప్పించలేదుకు.

"అలాగేనండి".

"యస్. మాడమ్. అనడం రాదు. ఇంతకీ ఏ వూరు మనది."

"అమలాపురం దగ్గిరండి."

"అమలాపురం దగ్గిరండీ, కాకినాడ దూరమండీ అనకపోతే అసలు వూరు పేరు చెప్పొచ్చు కదా?"

నీలమణికి ఒళ్ళంతా చెమట పట్టేసింది. నోట మాట రావటల్లేదు.

ఇంకా వాళ్ళేదో ప్రశ్నలు వేస్తున్నారు. నీలమణి తన తెలివి తక్కువ జవాబులలో వాళ్ళని ఆనందింప జేస్తున్నాడు.

"ఒక సినిమా పాట పాడండి వదిలేస్తాం" అంది తెల్ల చీర మీద తెల్లకోటు వేసుకున్న అమ్మాయి. అక్కడున్న వాళ్ళల్లో ఆ అమ్మాయే బాగుంది.

"అవు నో సినిమా పాట పాడండి".

నన్ను పాడమన్నారు. నేను పాడేశాను.

"మీరు పాడండి."

"నాకు రావండి."

"సినిమా పాటలు రావా? నేర్చుకోవాలండి. ఇంతకీ ఈ వూరొచ్చిన తరవాత ఏమేం సినిమాలు చూశారు?'

"ఏం చూడలేదండి."

"అసలు మీ రెన్ని సినిమాలు చూశారు మొత్తం?"

అతనిచ్చిన సమాధానానికి అక్కడున్న వాళ్ళందరికీ ప్రపంచం తప్పినట్టనిపించింది.

"మూడండి".

"ఏమిటేమిటి?" ఆ షాక్ నుంచి తేరుకున్న అమ్మాయి అడిగింది.

"వెంకటేశ్వర మహాత్యం, మాయాబజార్, వేమన."

"మీరుకూడా ఆ వేమనలా ఎందుకు సన్యాసం పుచ్చుకోకూడదు?" ఎవరో అడిగారు.

మా పరిచయం మూడవ రోజున అడుగు పెట్ట గానే నేను మరో షాక్ తిన్నాను.

"సార్! ఏమనుకోనంటే ఒక మాట."

"చెప్పండి".

"నా కో ఐదు రూపాయలు ఇస్తారా?"

ఆశ్చర్యంగా అతని కేసి చూశాను. అతనొచ్చి ఇంకా మూడు రోజులు అవకుండానే తెచ్చిన డబ్బంతా ఎలా గయి పోయిందో నా కర్థం కాలేదు.

"పోనీ ఒక రెండుంటే ఇవ్వండి. నేను బయలు దేరి వచ్చేటప్పటికి అన య్యకింకా జీతంరాలేదు— జిల్లా పరిషత్ స్కూళ్ళల్లో జీతా లెలా ఇస్తారో మీకు తెలిసే ఉంటుంది. జీతం రాగానే పంపుతా నన్నాడు. ఎక్కడో బయట తెచ్చి బత్తా ఖర్చుల కిచ్చాడు."

నేను మాట్లాడకుండా జేబులోంచి అయిదు రూపాయలు తీసిచ్చాను.

"ఏమనుకోరు కదా? ఈ వూరు మొత్తం మీద మీ రొక్కరే నాకు తెలుసున్న వాళ్ళల్లా కనిపిస్తు న్నారు."

నా కెందుకో అతని మీద విపరీతమయిన జాలి వేసింది.

మా పరిచయం మరి పెరగకుండానే నీలమణి తన ఆర్థిక పరిస్థితి గురించి వివరించాడు. బహుశా అది మా మధ్య పరిచయం పెరగడానికి తోడ్పడిం దేమోకూడా.

నీలమణికి తండ్రి లేడు. తల్లి ఉంది. ఒకన్నయ్యా

ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ ఉన్నారు. కుటుంబమంతా ఆర్థికంగా అన్నగారి మీదే ఆధారపడి ఉంది. ఆయన వీళ్ళ వూరుకి దగ్గిరే ఉన్న నూరో ఎలిమెంటరీ స్కూలు మాస్టారుగా పని చేస్తున్నాడు.

అసలు నీలమణి మెడిసిను చదవడం వాళ్ళమ్మగారికి కాని, చుట్టాలకు కాని ఎవరకూ ఇష్టం లేదుట. కాని వాళ్ళన్నయ్య పట్టు బట్టాడుట. "వాడుకూడా నా లాగే. అ ఆ, ఇ ఈ లు దిద్దిస్తూ కూర్చోవడానికి వీల్లేదు. వాడు డాక్టరవ్వాలి. అయి తీరాలిసిందే." అన్నయ్య గురించి చెబుతున్నప్పుడు నీలమణి కళ్ళు మెరిశాయి. అతని గొంతుక వణికింది. ప్రతి మాట లోను భక్తి గోచరించింది.

నీలమణి పరిస్థితి విన్న తరవాత నాకు భయం వేసింది.

నా హృదయంలో ఒక వేధించే ప్రశ్న బయలు దేరింది. నీలమణి ఈ చదువుని పూర్తి చేయగలడా? అని.

నాలుగో రోజుని అన్నాడు "ఇక్కడికి వచ్చిన తరవాత రెండు పూటలా సరిగ్గా సంధ్య వార్చడం పడటం లేదండీ అలాగయితే గాయత్రి శపిస్తుంది". నాకు నవ్వొచ్చింది. కాని అపుకున్నాను అతను 'హర్ట్' అవుతాడేమోనని.

ఆ రోజు రాత్రి నీలమణి పరిస్థితి చూసి నాకు ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయం వేసింది. భగవంతుడా ఇతన్ని నాకు రూమ్మేటుగా వేసేవేమిటిరా అనిపించింది. నేను మంచి నిద్రలో ఉండగా వచ్చి లేపాడు. రూమ్‌లో కొస్తూనే ఏడుపు మొదలు పెట్టాడు. అప్పుడు టైము రాత్రి రెండు గంట అయ్యింది.

"ఏమిటీ?" అన్నాను అర్థంగాక.

సమాధానం చెప్పకుండా ఒక అయిదు నిమిషాలు ఏడిచాడు. తరవాత చెప్పాడు, "చాలా అసహ్యంగా రాగ్ చేస్తున్నారు సార్! చివరికి రెండొందరో ఒకటి నా బట్టలుకూడా విప్పించేశారు. బూతులు మాట్లాడ మంటున్నారు. బూతు బొమ్మల్ని చూపించి ముద్దెట్టు కోమంటున్నారు. చీ చీ నే నిక్కడుండ లేను సార్."

"పడుకోండి. అలా బాధ పడితే ఎలా?" అంటూ లైటార్పేశాను. నాకు మళ్ళీ నిద్ర పట్టే టప్పటికి ఇంకా నీలమణి ఏడుపు వినిపిస్తూనే ఉంది.

మరునాడు పొద్దున్నే చెప్పాడు నీలమణి 'రాత్రంతా ఆలోచించాను సార్. ఇక్కడే ఉండదలుచుకున్నాను. నే నిప్పుడు తిరిగి వెళ్ళిపోతే మా అన్నయ్య ఏమయిపోతాడు సార్."

"గుడ్ ఏం భయపడకండి. మమ్మల్ని మాత్రం రాగ్ చెయ్యటం లేదు. ఇప్పుడు మనల్ని రాగ్ చేసిన వాళ్ళేరేపు మనకి బెస్ట్ ఫ్రెండ్స్ అవుతారుట. 'పైకి అలా అన్నాను కానీ నీలమణికి జరుగుతున్న రాగింగ్ ఎలాటిదో నాకు తెలుసు. అంతవరకూ కాలేజీ చరిత్రలో అలాటి రాగింగ్ తక్కువ మందికి జరిగి ఉంటుంది. నీలమణికి అసలు ప్రపంచ జ్ఞానం లేదు. దానికి తోడు అతను అస్సలు అబద్ధం ఆడడు.

నీలమణిగురించి నాకు త్వరలోనే చాలా విషయాలు తెలిశాయి. నీలమణి విశాఖపట్నం వచ్చిన తరవాతే మొట్టమొదటి సారిగా చెప్పులు తొడుక్కున్నాడు. మెడికల్ కాలేజీలో ఎడ్మిట్ అవడానికి వచ్చినప్పుడే మొదటి సారిగా రైలెక్కాడు. విశాఖపట్నం వచ్చిన తరవాతనే అతనికి క్రికెట్ ఆట ఏమిటో తెలిసింది. విశాఖపట్నం వచ్చిన తరవాతనే మొదటిసారిగా పరాయి అమ్మాయిలో మాటాడాడు.

ఆ అమ్మాయి ఎవరో ఈ పాటికి మీరు వూహించే ఉంటారు. నేను కథ మొదట్లోనే వర్ణనాతీతం అని వర్ణించిన నీరజ.

ఆ రోజు సాయంత్రం నీలమణి చాలా ఉషారుగా ఉన్నాడు. నేను అడగకుండానే చెప్పాడు కారణం.

"ఈ వేళో గమ్మత్తు జరిగింది సార్?"

"ఏమిటి?"

"ప్రాక్టికల్సయి వచ్చేస్తుంటే నన్నూ, ఆ అమ్మాయిని ఒక ముగ్గురు సీనియర్స్ పట్టుకున్నారు. ఆ అమ్మాయితో పరిచయం చేసుకోమన్నారు. నాకు నోట మాట రాలేదు. ఆ అమ్మాయి ధైర్యంగా పరిచయం చేసేసుకుంది. ఇంగ్లీషు ఎంత బాగా మాట్లాడిం దనుకున్నారు. ఒక అయిదు నిమిషా లుంచి వాళ్ళు ఒదిలేశారు. వచ్చేస్తుంటే అంది ఆ అమ్మాయి ఏమిటండీ మీరంత భయపడతారని. నాకు సిగ్గేసింది ఆ అమ్మాయి తెలుగు కూడ చాలా బాగా మాట్లాడుతుంది."

"ఇంతకీ ఆ అమ్మా యెవరూ?" అడిగాను.

"ఆ అమ్మాయేనండీ" అన్నాడతను సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ.

"ఎవరో చెప్పకపోతే నా కెలా తెలుస్తుంది?" కొంచెం విసుగ్గా అన్నాను.

"నీరజ."

ఆ రోజు రాత్రి పడుకోబోయే ముందు అన్నారు నీలమణి. "సార్! నేను పల్లెటూరివాణ్ణి. నాకిక్కడ ఎలా మసలుకోవాలో తెలియదు. నేనేమైనా తప్పులు చేస్తుంటే చెప్పండి సార్."

"చూడండి—ముందర ఆ సార్ అనడం మానెయ్యండి" అన్నాను నేను టక్కున.

అది నేను నీలమణికి చెప్పిన మొదటి పాటం. ఆ రోజు నుంచి హౌస్ సర్జన్సీ అయిపోయేదాకా అలాటివి చాలా చెప్పాను. ఇప్పుడు ఆలోచిస్తుంటే అనిపిస్తుంది—నీలమణి నేను మలచిన శిల్పం అని.

నీలమణి ఎంత మారినా అతనిలోని ప్రాథమిక నైజంలో ఎలాంటి మార్పూ రాలేదు. అతనిలోని అమాయకత్వం, నిజాయితీ అలాగే నిలిచి ఉన్నాయి. ముందే చెప్పినట్లున్నాను నీలమణిలో అన్నిటి కంటే నాకు నచ్చిన గుణం హిపోక్రసీ లేకపోవడం.

* * * *

నీలమణి తన రహస్యాల్ని నాతో పంచుకొనేవాడు. తన ఆర్థిక పరిస్థితిని తలుచుకుని బాధపడేవాడు, తల్లి ఆరోగ్యం గురించి భయాన్ని వెలిబుచ్చేవాడు.

"మా అమ్మకి అప్పుడప్పుడు గుండెల్లో నొప్పి వస్తుందిట. ఏమిటంటారు? మా వూళ్లో డాక్టరు లేడు. అమలాపురం పోయి చూపించుకోవాలి."

మెడిసన్‌లో చేరిన అందరూ చదువు పూర్తి చేయడానికి తొందరపడతారు. నీలమణి అందరిలోకీ ఎక్కువ తొందరపడేవాడు. కారణం డబ్బు సంపాదించడానికి కాదు—తన తల్లికి వైద్యం చెయ్యడానికి.

"పోనీ మన హాస్పిటల్లో చూపించ వచ్చు ఈమధ

ఉచితం! ఉచితం !!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఏరుపు రంగును మా ప్రఖ్యాత మందు మా అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:

BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

వాయిదాలమీద ట్రాన్సిస్టర్లు

ఎగుమతి నాణ్యత గల శక్తివంతమైన ఏ/సి—డి/సి బ్యాటరీ మల్టీ—బి, 4 బ్యాండ్ల అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్ ను ఇప్పుడు వెలపరి రు. 10/-ల మాసిక



వాయిదాల మీద పొందండి. వెల రు. 250/—లు, రెండు సంవత్సరముల గ్యారంటీతో ప్రతి పల్లెకు, పట్టణంకు మీ ఇంటికి పంపబడగలదు. ప్రతి సెట్టుతోను లైసెన్సు ఉచితము. నేడే ఆర్డరు పంపండి.

EACHO RADIO &
TRANSISTOR CO. (AP)
Post Box No. 9447, Delhi-110051.

ఇంగ్లీష్
ఈ తప్పులు మీరు చేస్తారా?
వ్యాకరణం లోపాలు గాని లేదా మీరు అనుకున్న అర్థంకాక ఇంకో అర్థం ఇచ్చే మాటలు వాడడం కాని. 8 వారాల శిక్షణ తరువాత మీలో మీకు తృప్తి కలగకపోతే. మొత్తం కోర్సు అదనపు డబ్బు లేకుండా మళ్ళీ చదవవచ్చు

10th Sept. 1979

polycraft
30-3rd Floor, Opp. Hotel Emerald
Abids Shopping Centre,
Hyderabad-500001.

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు ______
విలాసము: ______
______ PIN ______




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14.
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ —



శు భ వా ర్త
నాడీప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు
డా॥ ఎస్. ఎస్. రావు, M.B.H., R.M.P.
గారిని సంప్రదించండి:
రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,
జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ హవుసింగ్ సొసైటి బిల్డింగ్సు,
ప్లాట్ నెం. 471, హైదరాబాద్
( నాంపల్లినుండి బస్సురూటు 185 )

శరీర బలహీనత, పూబిగా పెరుగుట గాని, చిన్నప్పటి నుండి సన్నగా నుండి ఏ మందు వలనను లావు కాకపోవుట, అంగములు వుండవలసిన సైజులో వుండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండెదడ, రక్త ప్రసరణ ఎక్కువ గావడం, లేక తక్కువ గావడం, సర్వ విధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్‌ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలి చేరుట, స్త్రీల ముట్టుకుట్టు నొప్పి, కుసుమవ్యాధి ( ఏ రంగైనా సరే ), మూత్రవ్యాధులు, మూలశంక, సుఖవ్యాధులు, స్త్రీలకు గాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుంనొప్పి, కీళ్ళవ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరము, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘవ్యాధులుగా పరిణమించినప్పుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలము: ఉ. 7 గంటల నుండి సా. 5 గంటల వరకు
పరీక్ష ఫీజు: రూ. 12/—. చికిత్సకు అదనం.

ప్రతి నెల క్యాంపులు:— 4వ తేదీ కర్నూలు—న్యూఉడిపి హోటల్ (పెద్దమార్కెట్‌వద్ద); 5వ తేదీ బళ్ళారి—మీనాక్షి లాడ్జి; 6 వ తేదీ గుంటకల్ — శ్రీ లాడ్జి; 7 వ తేదీ కడప—ద్వారకా లాడ్జి; 8 వ తేదీ తిరుపతి — భీమాస్ అనెక్స్‌లాడ్జి; 9, 10 తేదీలు మద్రాసు — కోమలవిలాస్, నెం. 5, ఫ్రాన్సిస్ జోసఫ్‌స్ట్రీట్ ( జి.టి. ); 11 వ తేదీ నెల్లూరు — రాఘవ విహార్; 12వ తేదీ గుంటూరు— ఉడిపి కృష్ణభవన్, స్టేషన్‌రోడ్; 13, 14 తేదీలు రాజమండ్రి — శాంతినివాస్ (మెయిన్‌రోడ్డు); 15, 16 తేదీలు వైజాగ్ — బృందావన్ లాడ్జి; 17 వ తేదీ విజయవాడ — మోడరన్ కేఫ్ లాడ్జి (గాంధీనగర్); 18 వ తేదీ ఖమ్మం — మయూర్ కేఫ్, (శీష్‌మహల్ లాడ్జి); 19 వ తేదీ వరంగల్ — హోటల్ నటరాజ్; 20వ తేదీ నుండి హెడ్డాఫీసు.

Swastik

రాకూడదూ." ఆలోచించకుండా అనేశాను.

నీలమణి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అమ్మ రాదండి. డబ్బు ఖర్చనీ, ఇక్కడికి తీసుకొస్తే లాడ్జిలో ఉంచాలి."

గుడ్డిలో మెల్లన్నట్టుగా నీలమణికి స్కాలర్‌షిప్ప్రకటి వచ్చేది. వాళ్ళన్నయ్య పది పదిహేను అప్పుడప్పుడు మనియార్డరు చేసేవాడు. నీలమణి తన బట్టలు తనే ఉతుక్కునేవాడు, సినిమాలు చూసే వాడు కాదు. తప్పనిసరిగా కొనాల్సిన 'సబ్బు' లాంటివి కూడా తను చాలా చవకబారువి కొనేవాడు. నీలమణికి రకరకాలుగా నేను సహాయం చేసేవాడిని. అవన్నీ నేను నీలమణి మీద జాలితో చేసినవి కాదు. అవి నాకొక విధమైన సంతృప్తిని ఇచ్చేవి.

నీలమణి నన్నుచూసి ఎప్పుడూ 'జెలసీ' ఫీల్ అయినట్లు అనిపించలేదు కాని నేనుమాత్రం నీలమణిని చూసి ఒక విషయంలో 'జెలసీ' ఫీల్ అయ్యే వాణ్ణి. అదే నీరజతో అతని స్నేహం.

నీరజ నీలమణితో చాలా స్నేహంగా ఉండేది. ఆమె నీలమణితో మాట్లాడే పద్ధతిలోనూ, మిగతా వాళ్ళతో మాట్లాడే పద్ధతిలోనూ తేడా స్పష్టంగా కనిపించేది. నీలమణి పట్ల ఆమె ప్రవర్తనలో ఆత్మీయత గోచరించేది.

నీలమణి నీరజ ఆకర్షణలో పడిపోయే డనడంలో ఎలాంటి సందేహం లేదు. అసలు నీరజలో అంత పరిచయం ఉండి ఆమెని ప్రేమించలేని వాడు మనిషి కాడని నా అభిప్రాయం.

నేనూ, రంగనాథం, రాజారావ్ మేమందరం కూడా నీరజంటే పడి చచ్చేవాళ్ళం. ఆమె మాతో మాట్లాడితే చాలు మా జన్మ ధన్యం అయినట్లు అనిపించేది.

"పొటాషియం సైనైడ్ ఎక్కడుందండీ?" అని ఆమె కెమిస్ట్రీ లాబ్‌లో అడిగితే ఇంకావేళ ప్రాక్టికల్స్ ఏం చేస్తున్నామో తెలిసేది కాదు. ఆమె ఆ చేత్తో సైనైడ్ ఇచ్చేసినా తినెయ్యడానికి సిద్ధంగా ఉండేవాళ్ళం.

అలాంటి నీరజ నీలమణితోటి ప్రాక్టికల్స్ చేస్తున్నంతసేపూ మాట్లాడేది. ఆమెకు రాని రెకార్డ్సన్నీ నీలమణి చేసిచ్చేవాడు. ఆమెప్రాక్టికల్స్ చెయ్యడం ఆలస్యం అయిపోతే అబ్జర్వేషన్లు రాసిచ్చేవాడు.

నేనుండబట్టలేక ఒకరోజు "ఏదయినా చాన్స్ కొట్టేశావోయ్ నీలమణి" అన్నాను.

నీలమణి ముసిముసి నవ్వులు నవ్వేసి పూరుకున్నాడు.

నీరజ గురించి అనేక విషయాలు చెప్పేవాడు నాతోటి. నీరజ తండ్రి డాక్టరు. విజయవాడలో ప్రాక్టీసు చేస్తున్నాడు. నీరజకు ఇద్దరు చెల్లెళ్ళు, ముగ్గురు తమ్ముళ్ళు.

"వాళ్ళకి కారుందటోయ్!" ఆశ్చర్యంగా చెప్పేడు.

"వాళ్ళ పెద్ద చెల్లెలు బియ్యే చేస్తోంది. అచ్చం ఈమెలాగే ఉంటుంది. ఫోటో చూశాను నేను. పేరేమిటో వూహించగలవా? కవివి కదా నీకు. బాగా నచ్చుతుంది. నీహారిక. నీహారిక తమ్ముడు క్రికెట్ ఆడుతాడట. అతనేమైన టెస్ట్ ఆడి

తిరుతాడట!"

ఇలాగే ఏవో చెప్పేవాడు.

"వాళ్ళమ్మ గారికి ఈవిడ డాక్టర్ కావడం ఇష్టం లేదట. ఆడపిల్లకంత పెద్ద చదువెందు కంటారుట. కాని వాళ్ళ నాన్నగారు పట్టుబట్టి చదివిస్తున్నారట.

ఒకరోజు నీరజ కెమిస్ట్రీ రికార్డు రాస్తూ కనిపించాడు.

"ఇదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"అబ్బే ఏం లేదు. మీ రైటింగ్ బాగుంటుంది నా రికార్డు ఓసారి రాయకూడదా అంది — రాస్తున్నాను"—అంటూ ఓ వెర్రి నవ్వు నవ్వాడు.

"అదేమాట నేనూ అంటున్నాను. నా రికార్డు కూడా రాయి" అన్నాను చిరాకుగా. మర్నాడు పొద్దున చూస్తే నా రికార్డు కూడా రాసింది.

క్రమక్రమంగా నీలమణి నీరజను ఆకర్షించడానికి ప్రయత్నించటం మొదలు పెట్టాడు.

"అబ్బ నీరజకు క్రికెట్ అంటే ఎంతిష్టమోయ్. నాకు క్రికెటొచ్చినా బాగుండును. నీ కొచ్చును కదా——నాకు నేర్పకూడదగా. ఇంతకీ సోబర్స్ అంటే ఎవరూ? అతనో ఒకసారి మాటాడి చాలుట జీవితం ధన్యమై పోతుందట.

ఒక రోజు ఆదివారం నేను మామ్ రాసిన 'ది సమ్మింగ్ అప్' పట్టుకుని కూర్చున్నాను నీలమణి దగ్గరగా వచ్చి కూర్చుని అన్నాడు.

"నువ్వో హెల్ప్ చెయ్యాలోయ్!"

"ఏమిటి?" అన్నాను పుస్తకంలోంచి ముఖం తిప్పకుండానే.

"ఏం లేదు. ఆ పుస్తకం పక్కన పెటి, నేనిచ్చే పుస్తకం చదివి దాంట్లోని కథ, దాని మీద నీ అభిప్రాయం చెప్పాలోయ్."

నాకు ముందర అర్థం కాలేదు. మెల్లి మెల్లిగా అర్థం అయ్యింది.

"నీరజ ఇచ్చింది. ఇంతవరకు ప్రపంచంలో వచ్చిన పుస్తకాలన్నింటిలోకి ఇది గొప్పదిట. నన్ను చదవక తప్పదంది. చదివి నా అభిప్రాయం చెప్పాలిట. నీకు తెలుసు కదా నేనింత వరకు నవల్స్ చదవ లేదని, అందులో ఇంగ్లీషు నవల్సంటే మరీ భయం. నువ్వీ సహాయం చెయ్యక తప్పదు!"

"ఇంతకీ ఏం పుస్తకం అన్నాను

"పేరేదో మర్చిపోయాను. ఇదిగో చూడు," అంటూ షెల్ఫ్‌లోంచి తీసిచ్చాడు.

అది "గుడ్ ఎర్త్". నే నెప్పుడో చదివాను. ఈ మధ్యన మళ్ళీ చదివిన కారణంగా కథ బాగా గుర్తుంది. ఆ కథ అర్థమయ్యేటట్లు నీలమణికి చెప్పడం కంటే ఎనాటమీ పాసవటం సులభం అనిపించింది.

* * *

ఎనాటమీ, ఫిజియాలజీ సులభంగానే పాసయి ఫోర్త్ యియర్‌లోకి ప్రవేశించేం మేమందరం. నేనూ, నీలమణి, నీరజ ఒకే వార్డులో పోస్టు అయ్యాం.

క్లినికల్ సైడ్‌కు వచ్చిన కొత్తలో కూడా నీలమణి చాలా హడావిడి చేశాడు. ఆపరేషన్ థియేటర్‌లో మూడుసార్లు పడిపోయాడు.

బాధతో కేకలు పెడుతూన్న పేషంట్లను చూసి

**రాయి!**

నమ్మేవాడికి నిన్న
ప్రతి రాయీ ఒక దేవుడు!
నమ్మని వాడికి ఇల
మనిషే నేడు దేవుడు!

-ఎలోరా

తను కూడా బాధతో మెలికలు తిరిగి పోయేవాడు. ఆ వేళ సరిగ్గా భోంచేసే వాడు కాదు. ఆ రాత్రి సరిగ్గా నిద్ర పోయేవాడు.

తెల్ల పాంటు, తెల్ల షర్టు మీద తెల్లటి ఏప్రాలు వేసుకుని ప్రతి బెడ్డు దగ్గరికి వెళ్ళి పేషంట్లకు— "ఏం ఫర్వాలేదు. తగ్గిపోతుంది" అని చెప్పే నీలమణిని చూస్తే నాకు "ఐడియల్ డాక్టర్" అనిపించేది.

అమలాపురం దగ్గర వూళ్ళ వాళ్ళెవళ్ళైనా వస్తే నీలమణి వాళ్ళని మరీ ఆదరంగా చూసేవాడు. వాళ్ళకు కావలసిన సామాగ్రి కొని తెచ్చేవాడు.

ముకికి భక్తి

ఫోటో— శివశంకరయ్య



అతడు అప్పుడప్పుడు వైద్య శాస్త్రం సాధించలేని విజయాల్ని తల్చుకుని విచారించేవాడు. "ఎందుకండీ ఈ మెడిసిన్ అంతా—కాన్సర్‌కి క్యూర్‌ని కనుక్కోలేనప్పుడు" అని వాపోయేవాడు.

క్లినికల్ సైడ్‌కొచ్చిన తర్వాత నీరజ—నీలమణి స్నేహం మరింత పెరిగింది. ఇద్దరూ కలిసి కేసులు చూస్తుండేవారు. నీలమణి మా వార్డులో అందరి కంటే బాగా చదివేవాడు. నీరజకి తెలియనివన్నీ చెబుతూండేవాడు.

నీరజపట్ల నాకు ఆసక్తి తగ్గి పోయింది. కారణం ఆమె నా పట్ల ఆసక్తి చూపక పోవడం అయి ఉండొచ్చు లేక నీలమణి మీద నాకున్న అభిమానం కొద్దీ ఆమె గురించి ఆలోచించడం, ఆమెను ఆకర్షించడానికి ప్రయత్నించడం మానేశాను.

నీలమణికి ఫార్మకాలజీ యూనివర్శిటీ ఎగ్జామ్స్‌లో కాలేజీ ఫస్టొచ్చింది. "ఎలాగ ఇప్పుడు? నీరజ పార్టీ ఇవ్వాలంటోంది. నా దగ్గర డబ్బులు లేవు కూడా" అన్నాడు.

"డబ్బుల కేముంది నేనిస్తాను."

"అది కాదోయ్! అలా అమ్మాయితోటి సినిమా కెళితే ఎవరేనా చూస్తే బాగుండదు కదా?"

"ఇది మరీ బాగుంది. రేపు పెళ్ళయిన తర్వాత కూడా ఇలాగే అంటావా?" అన్నాను చిరాకును ప్రదర్శించడానికి ప్రయత్నిస్తూ.

"అహ అప్పుడు వేరు కదా" అన్నాడు సిగ్గు పడడానికి ప్రయత్నిస్తూ.

నీలమణి ప్రేమ గురించి ప్రజలంతా అనుమాని స్తూనే ఉన్నారు. కాని 'ఫీస్ట్' రోజు సంఘటనతో అది పూర్తిగా బయట పడింది.

ఫీస్ట్ అయిపోయిన తర్వాత చుట్టు పక్కల రూములో ఉన్న మిత్రులంతా మా రూములచేరి కబుర్లు చెప్పడం మొదలు పెట్టారు.

హాస్టలులో ఏ ఇద్దరు చేరినా సినిమాల గురించి కాని అమ్మాయిల గురించి కాని మాట్లాడతారు ఆ రోజు అమ్మాయిల మీదికి మళ్ళింది టాపిక్.

వెంకట్రావన్నాడు "అమ్మాయిలు మరీ రెచ్చ గొట్టేటట్టు తయారవుతున్నారోయ్. నిన్న నీరజని చూశారా నీలంరంగు జాకెట్టు వేసుకుంది పలచటిది బ్రా స్పష్టంగా కనబడుతూంది. అది మనల్ని రెచ్చ గొట్టడం గాక మరేమిటి?"

"అది ఆమె స్వవిషయం. మీ కనవసరం!" అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న నీలమణి అన్నాడు.

"నువ్వేమిటోయ్ మధ్యన? నువ్వేం దానికి బాడీ గార్డువా? లేక మొగుడివా? పెద్ద మొగాడిలా మాట్లాడకు" వెంకట్రావు కవ్వించే ధోరణిలో అన్నాడు.

"నువ్వు మరో మాటు ఆ విషయం మీద మాట్లాడితే మర్యాద దక్కదు."

"ఏం చేస్తావేమిటి?"

"ఏం చేస్తాను" అంటూ నీలమణి వెంకట్రావు మీద పడి ఎడాపెడా కొట్టాడు.

వాళ్ళను విడిపించటం చాలా కష్టమయింది. అయితే దాంతోటి ప్రజలకు అంతవరకూ ఉన్న అనుమానాలు ధృవపడ్డాయి.

* * *

"అమ్మయ్య! ఎక్కడా తప్పకుండా చదువు పూర్తి చేశాం" అని నిట్టూర్చాను నేను రిజల్ట్స్ రాగానే. నీలమణి, నీరజ కూడా పాసయ్యారు. నీలమణికి సర్జరీ ఫస్టొచ్చింది.

"ఏ సినిమాకెడతాం చెప్పు. నిన్ను సినిమాకు తీసుకెళతాను" అన్నాను నేను.

"సినిమా వద్దు బాస్. శిల్పప్రదర్శన ఏదో అవుతుందిట అది చూద్దాం. అలాటిది చూడాలని ఎప్పటి నుంచో కోరిక." నాకు తెలుసు నీలమణికి శిల్పాలంటే చాల ఇష్టమని. ఎటొచ్చీ అతనిక్కూడా నాలాగే ఆ కళతో పరిచయం లేదు.

నీలమణి ఆ ప్రదర్శనలోని కొన్ని శిల్పాల్ని చూసి పరవశించి పోయాడు. "డబ్బు లేదు కాని బాస్ లేకపోతే ఇవన్నీ కొనేసేవాణ్ణి" అన్నాడు.

నన్ను, నీలమణిని ఎక్కువగా ఆకర్షించింది ఒక స్త్రీ బొమ్మ. ఆ స్త్రీ చంకలో బిందె ఉంది. ఆ బిందెలోంచి ఆమె నీరు కొద్దిగా వంపుతూంది.

"అబ్బ! ఎంతందంగా చెక్కాడు" అన్నాడు నీలమణి. నీలమణిలో అంత సౌందర్యాన్ని ఆస్వాదించే హృదయం ఉందని నేనెప్పుడూ అనుకోలేదు.

"బాస్! నేను డబ్బు సంపాదించిన తర్వాత గొప్ప

దీని తెలుపుచేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి:

## సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే తెలుపు




ప్రతిసారీ క్రమం తప్పకుండా సూపర్ రిన్ వాడి మీ బట్టలు మరింత తెల్లగా ఎలా అవుతాయో చూడండి. మరే ఇతర డిటర్జంట్ బిళ్ల లేదా బార్ కంటే ఎంతో తెల్లగా ఉతుకుతుంది సూపర్ రిన్. ఎందుకంటే, సూపర్ రిన్‌లో ఉంది ఉత్తమమైన తెలుపుచేసే శక్తి. దీని తెలుపు చేసే శక్తిని మీకు మీరే ఋజువు చేసుకోండి.




### మరే ఇతర డిటర్జంట్ బిళ్ళ లేదా బార్ కంటే మరింత తెలుపు చేసే శక్తి

హిందూస్థాన్ లివర్ వారి విశిష్ట ఉత్పాదన. లింటాస్—HL. 34-303 TL (RR)

శిల్పినొకతన్ని పిలిపించి నీరజ శిల్పం చెక్కిస్తాను."

"ఎందుకో తెలుసా?" మళ్ళీ తనే అన్నాడు.

"ఎందుకంటే ప్రపంచంలో ఏ శిల్పి నీరజతోటి సమానమైన అందాన్ని సృష్టించలేడని నిరూపించడానికి!"

నేను మాట్లాడలేదు. నవ్వి వూరుకున్నాను.

నీరజలో నాకిప్పుడంత అందం కనిపించడం లేదు.

నీలమణికి అంతందంగా కనిపించడానికి కారణం ఆమె అందం కాదు. ఆమెపట్ల అతనికున్న ఆరాధన.

ఆ రోజు మార్చి ముప్పై ఒకటో తారీఖు. ఇప్పటికీ నాకు బాగా గుర్తు. నీలమణిలో ఏదో కొత్తదనం కనిపించింది. నాతో ఏదో మాట్లాడబోయి ఆగిపోతున్నాడని గ్రహించాను.

"ఏమిటి?" నేనే కదిపాను.

"ఆహా. ఏం లేదు. నువ్వేం అనుకోనంటే ఒకటడుగుతాను."

"అడుగు" అన్నాను.

"నువ్వు మొన్న కుట్టించుకున్న నీలం షర్టు ఒకసారి ఇస్తావా?"

నేను ఆశ్చర్యపోయాను. నీలమణికి మంచి బట్టలు ఎప్పుడూ లేవు. కాని ఆరేళ్ళ మా పరిచయంలో అతను నన్నెప్పుడూ బట్టలు అడగలేదు.

"అహా—ఇష్టం లేకపోతే ఒద్దులే— నువ్వేం అనుకోకు" అన్నాడు కంగారుగా. ఆ మాటల్లో అతనికి నా షర్టు ఇవ్వలేక పోతున్నానని నేను బాధపడుతున్నానేమోనన్న భయం ధ్వనించింది.

"షర్టేం కర్మ—కావాలంటే పాంటు కూడా తీసుకో. కారణం ఏమిటని అడుగుతున్నాను."

నీలమణి ముఖం వెలిగిపోయింది.

"ఈవేళ నీరజ అమ్మగారొస్తున్నారు. నీరజ పరిచయం చేస్తాను రమ్మంది. అక్కడి నుంచి సినిమాకు కూడా వెళ్ళొచ్చు. నీరజకైతే నా ఆర్థిక పరిస్థితి తెలుసనుకో. కాని వాళ్ళమ్మగారికి ఈ చింకి గుడ్డల వాడా నీరజ ఫ్రెండు అనిపించకూడదు గదా."

నీలమణి మనస్సు నా కర్థమయింది.

నీలమణి, నేను ఒకే పెర్సనాలటీ ఉన్న మనుష్యులం. అందుకే నా డ్రెస్ అతనికి కరెక్టుగా సరిపోయింది.

వెళ్తాంటే అన్నాను: "ఆల్ ది బెస్ట్."

"థాంక్యూ బ్రదర్. థాంక్యూ వెరీ మచ్. నేను సర్జనయ్యాక నువ్వు చూపించిన ప్రతి పేషంటును ఫీజు తీసుకోకుండా ట్రీట్ చేస్తాను" అంటూ ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఒక ఆడది మగాణ్ణి ఎంతగా మారుస్తుందో అర్థం అయింది నాకు.

అలా వెళ్ళిన నీలమణి మళ్ళీ రాత్రి పదిన్నరకి వచ్చాడు. ఎందుకో అతని ముఖం వాడిపోయి ఉంది. రాగానే బోళ్ళయినా విప్పకుండా మంచం మీద పడిపోయాడు.

"ఏమిటి నీలమణీ అలా ఉన్నావ్?" అన్నాను ఉండబట్టలేక.

అతను సమాధానం చెప్పలేదు. ఏదో ఆలోచనలో ఉన్నాడు. అతని ముఖం ఓడిపోయిన టీము కెప్టెను ముఖంలా ఉంది. లక్ష రూపాయల లాటరీ ఒక్క నంబరులో తప్పిపోయిన వాడిలా ఉన్నాడు.

"నేను దెబ్బ తిన్నానోయ్" అన్నాడు చివరికి.

"ఏమయింది" ఆత్రంగా అడిగాను.

అప్పుడు చెప్పేడు వివరంగా—నీలమణి హాస్టలుకెళ్ళేటప్పటికే నీరజ, వాళ్ళమ్మగారు డ్రెస్సయిపోయి ఉన్నారు. పరిచయాలుజరిగినతర్వాత "లీలామహల్"కి బయలుదేరారు. ఆవిడ నీలమణిగురించి వివరాలు— అంటే కులం, ఆస్తి—ఇలాటి వివరాలన్నీ సేకరించింది. నీలమణి అన్నిటికీ ఒపిగ్గా సమాధానాలు చెప్పేడు. తర్వాత ఆవిడ నీలమణి మీద శ్రద్ధ తీసుకోవటం మానేసింది.

అయితే అసలు ఆపద లీలామహల్‌లో వచ్చింది. రాజారావు రూపంలో. నీరజంటే ఇంకా పడిచస్తున్న వాళ్ళలో రాజారావొకడు. రాజారావుకి నీరజ వాళ్ళమ్మగారు పూర్వమే తెలుసు. ఏదో దూరపు చుట్టంకూడా అవుతాడు. అంతే, సాయంత్రం ఆరున్నర నుంచి రాత్రి పది గంటల వరకూ రాజారావు, ఆవిడ మాట్లాడుకున్నారు. నీలమణి,

వయో పరిమితి లేదు!

**GOLDEN OPPORTUNITY!**

కాలేజి హాజరు అవసరములేదు!

చాలా తక్కువ జీతం!

చక్కని ఫలితములు!

## తరగతులు 21-9-79న ప్రారంభించబడును

1. ఎమ్.బి.ఏ., ఎమ్.బి.ఎమ్., ఏ ఎమ్.ఐ.బి.ఎమ్., బి.యల్. మరియు పిహెచ్.డి.
   (ఏ పట్టభద్రుడైనను అర్హుడు)
2. మైసూర్ బి.ఏ., బి.కామ్. మరియు ఎం.ఏ.
   (గత పాఠశాల చదువు అవసరము లేదు.)
3. కామ్. యూనివర్శిటీ-ఇంటర్, డి.కామ్., బి.కామ్., బి.కామ్. (ఆనర్సు) మరియు ఎమ్.కామ్.
   (ఎస్. ఎస్. ఎల్. సి., కేరళ కంపార్టుమెంటల్ ఎస్. ఎస్. ఎల్. సి., మెట్రిక్, ఎస్.ఎస్.సి., హెచ్. ఎస్. సి., పి. యు. సి. ఉత్తీర్ణులైనను కాకపోయినను అర్హులే.)
4. ఆగ్రా బి.ఏ. మరియు బి.కామ్. (రెండు దఫాలుగా)
5. అకౌంటెంట్లు మరియు ఆడిటర్లు, బి.ఇడి. మరియు యమ్.ఇడి. (ఏ పట్టభద్రుడైనను అర్హుడు.)
6. ఇంటర్ ఆర్ట్సు, కామర్సు మరియు పి.యు.సి.
   (ఎస్.ఎస్.ఎల్.సి., ఎస్ఎస్.సి., హెచ్.ఎస్.సి.లో ఉత్తీర్ణులైనవారలు)
7. ఢిల్లీ, మద్రాసు మరియు మధుర మెట్రిక్.
   (గత పాఠశాల చదువు అవసరము లేదు.)
8. హోమియోపతి
9. అకౌంటన్సీ
10. ప్రీమెట్రిక్
11. సర్వీసు కమీషన్

* సమర్థవంతమైన కరెస్పాండెన్సు కోర్సులు * గ్యారంటీ సర్టిఫికేటు ఇవ్వబడును. * ప్రపంచంలో ప్రఖ్యాతి వహించిన సమర్థవంతమైన సంస్థ!
* ఐ. ఎ. ఇ., ఐ. బి. ఎ. ఎం. మరియు కామ్ యూనివర్సిటీలచే గుర్తించబడి, అనుబంధించబడినది.

పూర్తి వివరములకు దయచేసి రు. 2/—లు మనియార్డరుతో దరఖాస్తు చేసుకొనండి:

**SRI MURUGAN TUTORIAL INSTITUTE**

(Estd : 21—3—1952 * Govt. Regd. No. 3072)

**H. O. RISHIVANDIYAM - Pin : 606 205 - Tamilnadu**

బ్రాంచిలు:— సిలోన్, మలేషియా, సౌత్ ఆఫ్రికా, మారిషస్, ఇండోనేసియా, మద్రాసు, సేలం, బొంబే, ఢిల్లీ, కలకత్తా మరియు అండమాన్.

నీరజ శ్రోతలుగా మిగిలిపోయారు. నీరజ వాళ్ళ సంభాషణలో అప్పుడప్పుడు పాలు పంచుకుంది. నీలమణి మాత్రం నోట మాట రాకుండా అలా ఉండిపోయాడు.


"నరకంలో నాలుగు గంటలంటే అదే గురూ" అన్నాడాఖరికి.

మర్నాడే నీరజ వాళ్ళమ్మగారితోటి విజయువాడ వెళ్ళిపోయింది. మళ్ళీ పది రోజులకిగాని తిరిగి రాలేదు.

నీరజ వూరు నించి వచ్చిన తర్వాత మూడు రోజులకి ఆటంబాంబు పేలింది. నీరజ రాజారావు తోటి సినిమాకెళ్ళింది. నాకు నీలమణి ముఖంలోకి చూడటానికి భయం వేసింది. వెంకట్రావు అండ్ కో నీలమణి మీద జోకులెయ్యడం ప్రారంభించింది. నీలమణి భరించలేక పోతున్నాడని నాకు తెలుసు. కాని ఏం చెయ్యాలి?

రాజారావు మీద విపరీతమైన కోపం వచ్చింది. తందామనిపించింది. గతంలో నాకూ, రాజారావుకి ఒకసారి గొడవ జరిగింది. కొట్టుకోవడానికి సిద్ధం అయ్యాం. కాని నీలమణి ఆపడం వలన తగ్గిపోయాను.

నీలమణి బాగా డీలా పడిపోయాడు.



"నా జీవితం ఏమైపోయినా, ఆఖరికి నా దగ్గర పైసా లేకుండా పోయినా, పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీటురాకపోయినా భరించగలను కాని, నీరజ లేకపోతే బతకలేను" అన్నా డా రోజు.

"బాస్! నీరజ నన్ను నిజంగా ప్రేమించలేదంటావా?" అడిగాడు మరోసారి.

ఇంకోసారి చాలా విచిత్రమైన, ఆలోచింపదగ్గ ప్రశ్న వేశాడు. "అసలు ఆడవాళ్ళు ప్రేమిస్తారా?"

శనివారం సాయంత్రం, ఆరు రోజుల తర్వాత నీలమణి బట్టలు వేసుకుని బయటకు బయలుదేరాడు. ఎక్కడికని నే నడగలేదు. ఎందుకంటే నీలమణికి అలాంటి పట్టింపులెక్కువ. తనే చెప్పాడు. "నా భవిష్యత్తు ఈ సాయంత్రం తేలిపోతుంది."

రాత్రి పదిన్నరైనా నీలమణి రూముకి రాలేదు. నాకు హడావుడి పట్టుకుంది. చివరికి పదకొండు నరకి వచ్చాడు. కళ్ళు ఉబ్బి ఉన్నాయి. బాగా ఏడ్చినట్టున్నాడు. ఎండిపోయిన కన్నీటి చారికలు అతని ముఖం మీద కనిపిస్తున్నాయి.

అతను పేలి, చల్లారి మళ్ళీ పేలబోతున్న అగ్నిపర్వతంలా ఉన్నాడు. ఎవరేనా ఏడుస్తూంటే నేను భరించలేను.

* * * *

"నీరజ నన్ను ప్రేమించడం లేదు" అని నా ముఖంలోకి చూశాడు ఎఫెక్టు ఎలా ఉంటుందోనని.

నేను ఎలాంటి భావం ప్రదర్శించలేదు.

"అంతా అయిపోయింది" మళ్ళీ తనే అన్నాడు. అని ఏడవడం మొదలు పెట్టాడు.

"చూడు మణీ( అలా చిన్న పిల్లాడిలా ఏడవకు. జరిగిం దేమిటో చెప్పు" అన్నాను.

నీలమణి తనను తానే సంబాళించుకుని మొత్తం కథంతా ఇలా చెప్పాడు.

నీలమణి ఉమెన్స్ హాస్టలు దగ్గిర కెళ్ళేసరికి టైము పదున్నరయింది. వాచ్‌మన్ వెళ్ళి పిలవగానే నీరజ వచ్చింది. డ్రెస్సు ఎవరికోసమో వెయిట్ చేస్తున్నట్టుగా ఉంది.

"గుర్తున్నానా?" నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు నీలమణి.

"అదేమిటి అలా అంటారు?" అంది ఆమె నవ్వుతూ.

"ఎవరికోసమేనా వెయిట్ చేస్తున్నారా?"

"అవును రాజా వస్తానన్నాడు. పిక్చర్ ప్రోగ్రాం ఉంది."

నీలమణి ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు.

"మీ రేమనుకోనంటే ఒక్క మాట. నేను మిమ్మల్నెప్పుడూ ఏమీ కోరలేదు. కాని ఈ వేళ అడుగుతున్నాను. కాదనకూడదు. మీరు నాతో బీచికి రావాలి."

ఆమె తని కళ్ళల్లోకి ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటి కారణం?"

"చెప్తాను—బీచిలో మాట్లాడుకుందాం. ప్లీజ రండి."

ఆమె ఏం ఆలోచించిందో కాని వాచ్‌మన్ తోటి "నాకోసం ఎవరేనా వస్తే అత్యవసరమైన పని మీద ఎక్కడికో వెళ్ళానని చెప్పు" అని "పదండి" అంది అతనితోటి.

ఇద్దరి పాదాలు మెల్లగా ముందుకు కదులుతున్నాయి. ఇద్దరూ మాట్లాడలేదు. అతను ఏం మాట్లాడాలా అని ఆలోచిస్తున్నాడు.

బీచిలో ఇసుకలో కూర్చున్న తర్వాత అడిగాడు నీలమణి—"నాగురించి మీ అభిప్రాయం ఏమిటి?"

ఆమె తడబడింది: "అభిప్రాయాని కేముంది? మీరు మంచి స్నేహితులు."

"అంతేనా? పోనీ నేను సూటిగా మాట్లాడతాను నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.

ఆమె ఆశ్చర్యపడినట్టు కనిపించడానికి ప్రయత్నించింది.

ఆశ్చర్యపడొద్దు. ప్లీజ నేను భరించలేను. నా గురించి మీకు ఆరున్నర సంవత్సరాలుగా తెలుసు. ఈ పాటికి నా మీద మీ కో అభిప్రాయం కలిగి ఉంటుంది. సూటిగా అడుగుతునందుకు మన్నించండి. నను మీరు ప్రేమించడం లేదా."

ఆమె మాట్లాడలేక పోయింది.

మళ్ళీ అతనే అన్నాడు: "ఇన్నాళ్ళూ మనం ఎంతో సన్నిహితంగా ఉన్నాం. ఎంతో ఆనందంగా ఉన్నాం. ఈ ఆనందాన్ని మనం జీవితాంతం ఎందుకు పంచుకోకూడదు?"

చివరికి ఆమె నోరు తెరిచింది. "మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. నేను మిమ్మల్ని ఒక మిత్రుడిగా మాత్రమే భావించాను. మీరు నా కున్న స్నేహితులందరిలోకి దగ్గరివాళ్ళు!"

"పోనీ ఇన్నాళ్ళూ అలాగే చూసే రనుకుందాం. ఇప్పుడు మీ భావాలు మార్చుకోవచ్చుకదా.

ఆమె మాట్లాడలేదు.

"ఆలోచించండి. మరొక విషయం—మీరు బాధపడనని నాకు హామీ ఇవ్వాలి. నన్ను క్షమించాలి. ఈ మధ్య మీ ప్రవర్తనలో మార్పు వచ్చింది. నాతో పూర్వంలా ఉండటం లేదు. అందరూ మీ గురించి రాజారావు గురించి ఏవేవో చెప్పుకుంటున్నారు.

అతని మాటలకు ఆమె అడ్డొచ్చింది. "చెప్పుకోవడాని కేముంది( మే మిద్దరం త్వరలో పెళ్ళి చేసుకో బోతున్నాం."

తను షాక్ తిన్నాడు.

"నీరజా! మీరు నన్ను నిజంగానే ప్రేమించలేదా?"

"లేదు."

"ఆల్‌రైట్, నన్ను ప్రేమించటం లేదంటే నేను ఆశ్చర్య పోవటం లేదు. కాని రాజారావుకి మీకు ఉన్న పరిచయం, రాజారావు మీద మీకున్న అభిప్రాయం ఏమిటో నాకు తెలుసు. రాజారావుని మీరు ప్రేమించారని నన్ను నమ్మమంటారా?"

కొంచెం సేపు ఆమె మాట్లాడకుండా ఉండిపోయింది. చివరికి అంది.

"మీరు నన్ను ఏమనుకున్నా సరే నిజం చెప్తున్నాను. అసహ్యించుకున్నా సరే. మీకు అబద్ధం చెప్పటం కంటే అదే మంచిది. నాకు మీరంటే ఇష్టమే. కానినేనెప్పుడూఆవిషయాన్నివ్యక్తీకరించలేద,


ఉచితం ఉచితం ఉచితం

1950 సంవత్సరములో నూట డెబ్బది లక్షల కంటే ఎక్కువ బైబిలు గ్రంథములు లోకములో అమ్మబడినవని నీకు తెలియునా? ప్రస్తుత కాలమందు అనేకమంది బైబిలు గ్రంథమును చదువుచున్నారు. నీవు యోహాను సువార్త 6వ అధ్యాయము చదివిన యెడల మనుష్యులు ఆ గ్రంథమును చదువుటకు ఇష్టపడుటకు గల కారణమేమిటో నీకు తెలియును. మనుష్యుడు రొట్టె వలన మాత్రముకాదు గాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాటవలనను జీవించును అని యేసుక్రీస్తు నుడివెను. బైబిలు గ్రంథము చదువబడినట్లు ఇంకొక గ్రంథము అంత ఎక్కువ మందిచే చదువబడుటలేదు. లోకములో ముఖ్యమైన భాషలన్నిటిలో తర్జుమా చేయబడిన ఈ గ్రంథము 11 వందల భాషలలో వ్రాయబడియున్నది. దేవుని ప్రేమను గురించిన సువార్త చాలామటుకు లోకస్థులందరు తమ తమ భాషలలో చదువుతున్నారు. బైబిలులో ఇతర పుస్తకములను గురించి యేమియు లేదుగాని దానినిగూర్చి రెండు లక్షల కంటేఎక్కువ పుస్తకములలో వ్రాయబడినది.

యేసు ఇట్లనుచున్నాడు—

*"జీవాహారము నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలి గొనడు. నా యందు విశ్వసించువాడు నిత్యజీవము గలవాడు. నా యొద్దకు వచ్చువానిని నే నెంత మాత్రము బయటికి త్రోసివేయను."*

ఇంకా మీరు తెలిసికొన గోరిన యెడల—

**జీవిత ప్రకాశ పాఠశాల, రామాయపట్టణము, ప్రకాశం జిల్లా, ఆం. ప్ర. 523 291.**

స్క్రీన్ చదవండి
సుప్రసిద్ధ సినిమా వారపత్రిక

కిరాన్ బ్యూటీ పేర్లర్, సెంటార్ హొటల్, బొంబాయికి చెందిన మీనా టిపోటా యిలా అంటున్నారు.

"వేర్వేరు తరహాల జుట్టుకు ఏ షాంపూ వాడాలా అనే సమస్యే లేదింక! ప్రతి ఒక్కరి జుట్టుకీ సరిగ్గా సరిపోగల రకం వుంది గ్లీమ్‌లో..."

ప్రతి గ్లీమ్ షాంపూ దానిలోని ప్రత్యేక పదార్థాల మూలంగానూ, పుష్కలమైన నురగమూలంగానూ పూర్తి ఫలితాలను ఇస్తుంది. మీ జుత్తు ఏ రకానికి చెందినది అయినా, గ్లీమ్ మూలంగా దానికో కొత్త అందం సమకూడుతుంది. దాని ఫ్రెంచి సుగంధం మిమ్మల్ని అంటి పెట్టుకునే వుంటుంది—ఎంతో హాయిగా కూడా.

| గ్లీమ్ | గ్లీమ్ | గ్లీమ్ |
|---|---|---|
| రెగ్యులర్ | ఎగ్ | టానిక్ |

G-51A



ఇప్పుడు వీలైన 60 మి.లీ. సైజులో కూడా




గ్లీమ్ షాంపూ
ప్రఖ్యాత హెయిర్ డ్రెసర్ల మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.

కూర్మం చెప్పిన వాస్తవం!




జిందాబామ్ సురక్షితమైన, నమ్మకమైన బాధానివారిణి

ఎందుకంటే నేను మా నాన్నగారిమాటకు ఎదురు చెప్పలేను. అది నా బలహీనత. నాన్నగారు మీతోటి నాపెళ్ళికి ఒప్పుకోరు. మీకు డబ్బు లేదు. మీదీ మాదీ ఒక క్లాస్ కాదు. మొన్న ఇంటికి వెళ్ళినప్పుడు ఈ విషయాలన్నీ స్పష్టపడ్డాయి. అప్పుడే అమ్మ చెప్పింది. రాజారావుకి నాకూ పెళ్ళి కుదరబోతుందని నేను అభ్యంతరం చెప్పలేదు." ఆమె ఆగింది. పెద్ద బరువును దించుకున్నట్టుగా ఫీల్ అయ్యింది.

"థాంక్యూ, థాంక్యూ నిజం చెప్పినందుకు" అతను గొణిగాడు నీరసంగా.

"మనం ఇన్నాళ్ళూ మంచి ఫ్రెండ్స్‌గా ఉన్నాం. ఇప్పుడు కూడా అలాగే ఉందాం."

ఎందుకా ఫ్రెండ్‌షిప్. అతనికక్కర లేదు. అతను మాట్లాడకుండాఆకాశంలోకిచూస్తూ కూర్చున్నాడు. అలాఅరగంట గడిచింది. చివరికిఆమెఅంది వాళ్ళ మధ్య అల్లుకున్ననిశ్శబ్దాన్ని చెరిపేస్తూ "నేనింక వెళతాను."

"ష్యూర్, ష్యూర్" అతనూ లేచాడు. హాస్టల్ కొచ్చేవరకూ ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు. విడిపోతూంటే అన్నాడతను "విష్ యు ఆల్ దిబెస్ట్" ఆమె థాంక్సో ఏదో అంది. కానిఅతను వినిపించుకోలేదు కాళ్ళునుళ్ళీ బీచికేసినడిచాయి. ఇసకలో పడుకున్నాడు. దొర్లాడు, ఏడ్చాడు. చచ్చిపోదామనుకున్నాడు. పదకొండింటికి పోలీసులొచ్చివెళ్ళిపోవాలంటేతిరిగొచ్చాడు "నాకు కొంచెం ధైర్యం లేదు. ఏ మాత్రం ధైర్యం ఉన్నా ఆ సముద్రంలో దూకి చచ్చిపోయేవాణ్ణి!"

* * * *

తరవాత వారం రోజులు నీలమణి అదో ప్రపంచంలో బతికాడు. తరచుగా ఏడుస్తూ కనిపించేవాడు.

ఒకసారన్నాడు "ఎంత ఆలోచించినా నాకు నీరజ మీద కోపం రావటం లేదు. జాలి వేస్తోంది."

"నేనో పని చెప్తాను—చేస్తావా?"

"ఏమిటి?"

"ఈ పుస్తకం చదువు" అంటూ ఇచ్చాను. అది అతను చదివిన మొదటి నవల. అది మామ్ రాసిన "ఆఫ్ హ్యూమన్ బాండేజ్"

ఊహించిన దానికంటే చాలా త్వరగా చదివేశాడు.

"ఎలా ఉంది?"

"మరోసారి చదవాలని ఉంది."

"చదువు. ఆలోచించు. అందులో ఫిలిప్ తనని ఎప్పుడూ ప్రేమించని ఆడదాని కోసం ఎందుకు పడి చచ్చేవాడో ఆలోచించు."

నీరజ, రాజారావుల పెళ్ళి ఆగస్టు ఒకటో తారీకున విజయవాడలో జరిగింది. మేమెవ్వరం వెళ్ళలేదు. కారణం ఎవరికీ సెలవు లేదు. పదో తారీఖున విశాఖపట్టణంలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.

"ప్రెజెంట్ ఏం చేస్తే బాగుంటుంది?" మామూలుగా అడిగాడు.

"నీ ఇష్టం నీకేం ఇవ్వాలని ఉంటే అది ఇయ్యి. ఇంతకీ డబ్బులున్నాయా?"

"లేవు."

"మరెలా?"

అతను మాట్లాడలేదు.

రిసెప్షన్ ఆరున్నర నుంచి ఎనిమిది వరకు తర్వాత భరతనాట్యం ఉంది.

నేను ఏడు గంటలకల్లా వెళ్ళాను. అప్పటికే అందరూ వచ్చేశారు. నా కళ్ళు నీలమణికోసం వెతుకుతున్నాయి. నా మెదడు అతనిచ్చే ప్రెజెంటు ఏమిటా అని ఆలోచిస్తోంది ఆ ...డు ఆలోచన కదిలింది. అసలు రాడేమో ... బహుశా అసలు రాడేమో.

"నీలమణింకా రాలేదు కదా" అడిగింది నీరజ.

సరిగ్గా పదినిమిషాల తక్కువ ఎనిమిది గంటలకు వచ్చాడు నీలమణి— చేతిలో గులాబి రంగు కాగితం చుట్టి ఉన్న వస్తువుతో.

"ఐ విష్ యు విత్ మై హోల్ హార్ట్ ఎ వెరీ హాపీ మారీడ్ లైఫ్" అన్నాడు దానిని నీరజకు అందిస్తూ. రాజారావు ఏదో పని మీద లోపలికి వెళ్ళాడు.

"థాంక్యూ" అంది ఆమె అందుకుంటూ. గులాబీ రంగు పేపర్‌ని తీసేసింది. అది వీనస్ విగ్రహం. నాలుగు గాజు పలకల మధ్య బంధించబడి ఉంది.

"ఎంత?" తర్వాత అడిగాను.

"వెలలేదు."

"సరిగ్గా చెప్పు."

నీలమణి ఇలా చెప్పేడు.

"నే నా మాట అనేసరికి ఆయన కంగారు పడిపోయారు. "నో నో" అన్నారు. "నీకు డబ్బంత అవసరమైతే నేనిస్తాను కాని డాక్టరువి నువ్వు రక్తం అమ్ముకోవడం ఏమిటి?" అన్నారు. "అదికాదు సర్ పరిస్థితి అలాంటిది. ఎవరి దగ్గరా అప్పుతీసుకుని ఆ వస్తువు కొనలేను. దాన్ని నా రక్తంతోటే కొనాలి" చివరి కాయన ఒప్పుకున్నారు. ఫైవ్ హండ్రడ్ సీసీ అనుకుంటాను. తీసుకున్నారు. నా కిప్పుడు బాగానే ఉంది."

నిరాంతపోయాను.

"ఎవరితోటీ చెప్పకు."

"అలాగే."

* * *

ఆ సంవత్సరాంతానికి నాకూ, నీలమణికి మధ్య ఉన్న సంబంధం తెగిపోయింది. నీలమణికి ఎమ్మెస్ జనరల్ సర్జరీలో 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్'లో సీటొచ్చింది. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్‌లో సీటు రావడం అంటే మాటలు కాదు. నీలమణి ఢిల్లీ వెళ్ళిపోయాడు. మళ్ళీ ఎప్పుడూ విశాఖపట్నం రాలేదు. విశాఖపట్నం అతనికి చేదు గుర్తుల్ని మాత్రమే మిగిల్చింది. అందుకే బహుశా అతను విశాఖపట్నం రాడు.

నీలమణి చివరకు నా పెళ్ళికి కూడా రాలేదు. "క్షమించు. పెళ్ళి ఫోటోలు పంపు" అని ఉత్తరం రాశాడు. కోపం వచ్చి నేను జవాబు రాయలేదు. ఎప్పుడో ఒక సారి వాళ్ళ వూరు వచ్చినట్లు టెలిగ్రామ్ ఇచ్చాడు. తీరా నేను వెళ్ళేటప్పటికి అతను వెళ్ళిపోయాడు. ఎప్పుడేనా ఉత్తరాలు రాసేవాడు. అందులో అంతా చదువుగురించే ఉండేది.

రాజారావు,నీరజ భీమవరంలో ప్రాక్టీసుపెట్టారు. తర్వాత వాళ్ళ గురించి నాకేం తెలియదు. మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. నా ఎమ్డీ పూర్తి అయింది. నా ఉత్తరానికి జవాబుగా నీలమణి ఇలా రాసేడు.

"నీ డిగ్రీ పూర్తయ్యిందని తెలిసి చాలా సంతోషించాను. ఇక్కడ నాది కూడా ఎమ్మెస్ పూర్తయ్యిం. నీకో శుభవార్త. నాకేదేనా మేలు జరిగితే ప్రపంచంలో అందరి కంటే ఎక్కువ ఆనందించేది నువ్వేనని నాకు తెలుసు—అందుకే నేను నీకు శుభవార్త అన్నాను. నాకు ఎమ్. సి. హెచ్. ప్లాస్టిక్ సర్జరీలో సీటొచ్చింది అదీ సంగతి. నాదో కోరిక ఏమనుకోవు కదా. ఇప్పుడు నువ్వు డబ్బు సంపాదిస్తున్నావ్ కాబట్టి నాలాటి పేద విద్యార్థి ఎవడేనా చదువుకోడానికి ఒక రూపాయి అడిగితేకనీసం అర్ధ రూపాయేనా ఇయ్యి. ఇదివరకటి నీ సహాయాల్లాగే ఇది కూడా అపూర్వమైనది, నీ రుణం నేను తీర్చుకోలేను."

ఆ ఉత్తరం చదివిన తర్వాత ఎందుకో నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

తర్వాత చాలా కాలానికి నేను అనుకోకుండా హైదరాబాద్‌లో నీలమణిని కలిశాను. అతనేదో కాన్ఫరెన్సు కొచ్చాడు. నేను స్వంత పనిమీద వెళ్ళాను.

కలవగానే మా ఇద్దరికీ ఏం మాట్లాడుకోవాలో తెలీలేదు. నోట మాట రాకుండా ఉండిపోయాను. తర్వాత నన్ను తన హోటల్ రూముకి తీసుకెళ్ళిపోయాడు. నీలమణి సంవత్సరం క్రితం పెళ్ళి చేసుకున్నాడట. తనతోబాటు వాళ్ళావిడ కూడా వచ్చింది హైదరాబాదు. ఆవిడ పేరు ఉష. బెంగాలీ అమ్మాయి. చాలా అందంగా ఉంది. ఏమైనా నీలమణి అదృష్టవంతుడు.

"ఢిల్లీలో కుల్వంత్‌సింగ్ అని ఒక శిల్పి ఉండేవాడు. నేను ఆయన దగ్గరికి తరచూ వెళుతూ ఉండేవాణ్ణి శిల్పాలు చూడడానికి. ఉష అక్కడికి వస్తుండేది నేర్చుకోవడానికి. ఉష కూడా మంచి శిల్పి. నీ బొమ్మ చేయిస్తానుండు" అన్నాడు.

ఆమె కూడా చాలా సరదాగా మాట్లాడింది.

"నీరజ కనిపిస్తే బావుణ్ను—ఆమె బొమ్మ చేయించాలి ఉష కూడా కుతూహలపడుతూంది."

"నీరజ నీ కిప్పుడు గుర్తుకొస్తుందా ?" ఉష లేకుండా చూసి అడిగాను.

సమాధానంగా నీలమణి గట్టిగా నవ్వాడు. "మర్చిపోతే కదా గుర్తుకి రావడానికి. నా ప్రతి పని వెనుక నీరజ ఉంటుంది."

నీలమణి బాగా మారాడు. ఖరీదైన బట్టలు వేస్తున్నాడు. మాట్లాడేపద్ధతికూడా బాగా మారింది. నా చూపులన్నీ చదివినట్లుగా అన్నాడు. "ఖరీదైన బట్టలు వేస్తున్నానని చూస్తున్నావు కదూ. అప్పటి నుంచే ఉండేది నాకీ కోరిక. కానీ ఎప్పుడూ బయటకు రాకుండా జాగర్తపడ్డాను. నువ్వు రూములో లేనప్పుడు నీ బట్టలు తొడుక్కుని ఆనందించేవాణ్ని. క్షమిస్తావు కదూ."

నేను నోట మాట రాకుండా ఉండిపోయాను.

* * *

హాస్పటల్‌నుంచి రాగానే సుధ ఒక కవరు అందించింది. ప్రింటు కొట్టినట్టు ఉన్న రైటింగ్ ఎవరిదో నే నిట్టే పోల్చాను.

"ఒక విషయాన్ని పదేపదే చెబితే అది నీకు ప్రియమైన విషయమైనా చిరాకు వస్తుందని నాకు తెలుసు. తెలిసి నీ మనస్సుని చికాకు పరచడానికి సాహసిస్తున్నాను.



నాకు ఎక్కువ సంతోషం వచ్చినా, విచారం వచ్చినా నువ్వు గుర్తుకి వస్తావు. నీతోటి పంచుకోవాలని పిస్తుంది. నిజం! నీకు తెలుసు నేను అబద్ధమాడనని.

ఈనెల పదిహేడవ తేదీన ఒక గొప్ప విషయం జరగబోతూంది. అది నా జీవితంలో గొప్ప సంఘటన. అప్పుడు నువ్వు నా పక్కన ఉండాలి.పదహారో తారీఖున నువ్వు ఢిల్లీ రావాలి. ఎలాగో ఒలా లీవు పెట్టుకుని రావాలి. తప్పదు. ప్లీజ్ వస్తావు కదూ—నీలమణి.''

ఆ వేళ పన్నెండో తారీఖు. పదహారో తారీఖు వరకునాకు లీవు దొరకలేదు. ఆ వేళ బైలు దేరాను. ట్రెయిన్‌లో రిజర్వేషన్ సంపాదించడం చాలా కష్టమయింది.

ట్రెయిన్‌లో ఉన్నంతసేపూ ఆ విషయం ఏవిటా అని ఆలోచిస్తూనే ఉన్నాను. అలసిపోయి అలసిపోయి నా మెదడు ఆలోచనల్ని ఆపింది. బహుశా నీలమణికేదేనా సన్మానం జరుతూందేమో. లేకపోతే ఫారిన్ వెళుతున్నాడో.

స్టేషన్‌లో దిగినతర్వాత గుర్తుకొచ్చింది నీలమణి ఎడ్రసు ఇంటి దగ్గర మర్చిపోయేనని. నీరసం ముంచుకొచ్చింది. అంతలోనే తమాయించుకున్నాను. అప్పుడు టైము పదిగంటలైంది. నీలమణి ఎలాగైనా ఇప్పుడు హాస్పటల్‌లోనే ఉంటాడు. అందుకనే హాస్పటల్‌కి వెళ్ళాను.

ప్లాస్టిక్ సర్జరీ డిపార్టుమెంటులో కనిపించిన నర్సుసిస్టరు నడిగిగాను "డాక్టర్ నీలమణిని నేనెక్కడ కలవగలను?''

"నీలమణి థియేటర్‌లోకి వెళ్ళిపోయారు. బయటకు ఎప్పుడొస్తారో చెప్పలేను. అంతవరకు మీరు నీలమణిగారి రూములో వెయిట్ చెయ్యండి'' అంటూ ఆమె నీలమణి రూము చూపించింది.

రూమ్ నీటుగా సర్దబడి ఉంది. రూములో ప్రతి అంగుళం నీలమణి అభిరుచిని తెలుపుతూంది.

ఇంతట్లోనే 'గుడ్ మార్నింగ్' అని వినిపించి తలెత్తాను. ఎదురుగా ఒక ముప్పై ఐదేళ్ళ స్త్రీ నిలబడి ఉంది. ఆమెని చూడగానే ఏ ప్రాంతానికి చెందిందో చెప్పడం కష్టం. ఆమె కళ్ళు స్నేహపూర్వకంగా నవ్వుతున్నాయి.

"గుడ్ మార్నింగ్'' అన్నాను.

"నీలమణి లేరా? థియేటర్‌లో ఉన్నారా? మీరు నీలమణి ఫ్రెండా?'' ఇంగ్లీషులో గబగబా మాట్లాడిందామె.

"అవునవును రండి''అన్నాను. అప్పుడు చూశాను ఆమె నీలం రంగు చీర మీద అదే రంగు స్లీవ్‌లెస్ జాకెటు వేసుకుంది.

"నా పేరు జయ.''

నా పేరు కూడా చెప్పాను.

"నైస్ టు సి యూ. నీలమణి మీగురించి చాలా సార్లు చెప్పారు నాకు. మీరు తన బెస్టు ఫ్రెండట కదా. మిమ్మల్ని కలుసుకోవటం చాలా సంతోషంగా ఉంది'' నేను కుర్చీలో అనీజీగా కదిలాను.

"నేనిక్కడ గైనకాలజిస్టుగా వర్క్ చేస్తున్నాను.

ఆమె ఇంకా తన గురించి చాలా చెప్పింది. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. చివరికి మా సంభాషణ నీలమణి మీదకు మళ్ళింది.

"నీలమణి నిజంగా గొప్ప సర్జన్. నా ఉద్దేశంలో అలాటి ప్లాస్టిక్ సర్జన్ ఇండియాలో లేడు. నేను అంటూ ఉంటాను స్టేట్స్ వెళ్ళిపోకూడదా అని. ఇక్కడ ఉంటే మనకొచ్చినది కూడా నాశనం అయిపోతుంది. కాని నీలమణి వినిపించుకోడు. దేశభక్తి లాంటి అర్థంలేని కబుర్లు చెబుతాడు.''

నేను నవ్వి వురుకున్నాను.

"ఏడాది క్రితం కారు ఏక్సిడెంట్ అయ్యింది. ఇక్కడ పెద్ద మచ్చ పడింది'' అంది ఆమె బుగ్గ తడుముకుంటూ. "అప్పుడు నాముఖంఎంతఅసహ్యంగా అయిపోయిందో. నీలమనే ప్లాస్టిక్ సర్జరీ చేశారు. ఇప్పుడు దాని గుర్తు కూడా లేదు.'' అంది ఆమె.

పరీక్షగా చూస్తే ఆమె ముఖం మీద ఒక సన్నటి గీత కనబడుతుంది.

జయ వెళ్ళిపోయింది. నీలమణి ఎప్పటికీ రాటల్లేదు. విసుగుపుట్టి బయటకు నడిచాను.

కారిడార్‌లో ఎదురుగా కనిపించిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. ఆ వ్యక్తి కూడా నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. గబగబ నడుచుకుంటూ నా దగ్గరకు వచ్చాడు. నా రెండు చేతులూ పట్టుకుని అడిగాడు.

"ఏమిటిలా వచ్చేవ్?''

అతను రాజారావు.

"నీలమణికోసం'' అని అన్నాను.

"మరి నువ్వు?'' నేను అడిగాను.

"నేనా? అలా బయటికి రా చెబుతా'' అంటూ నన్ను లాక్కుపోయాడు.

హోటల్లో కాఫీ తాగుతుంటే చెప్పాడు రాజారావు. అతను చెప్పిన వాక్యాల్ని ఒక వరసలో పెడితే ఇలాటి అర్థం వస్తుంది. నీరజ నాలుగు నెలల క్రితం స్టవ్ మీద నుంచి నీళ్ళు దించుతూ దాని మీద పడిపోయి ముఖం ఒక వైపు చాలా బాగా కాలిపోయింది. అసహ్యంగా తయారయ్యింది. ప్లాస్టిక్ సర్జరీ చేయిద్దామంటే అందరూ నీలమణి పేరునే సజెస్టు చేశారు. అప్పుడు థియేటరులో జరుగుతున్న ఆపరేషన్ నీరజదే.

కాఫీ ముగించి మళ్ళీ నీలమణి రూములోకి వెళ్ళి కూర్చున్నాం.

చాలాసేపు వెయిట్ చేసిన తర్వాత ఒక సిస్టర్ రూమ్‌లో కొచ్చి చెప్పింది. "ఆపరేషన్ అయిపోయింది. డాక్టరుగారు పది నిమిషాల్లో వస్తారు.''

ఆమె చెప్పినట్లుగానే పది నిమిషాల్లో వచ్చాడు నీలమణి. కాని ఒక్కడూ రాలేదు. అతనితోపాటు మరో పది మంది పోస్టు గ్రాడ్యుయేట్స్, హవుస్ సర్జన్సు, కొలిగ్సు కాబోలు వచ్చారు. అందరూ నీలమణిని కౌగలించు కున్నంత పని చేస్తున్నారు. అభినందిస్తున్నారు.

"మార్వెలెస్.''

"ఫెంటాస్టిక్.''

వాళ్ళకు మాటలు దొరకటం లేదు.

రాజారావు కూడా ముందుకు వెళ్ళి నీలమణి రెండు చేతులూ పట్టుకొని "థాంక్స్ ఎ లాట్, థాంక్స్ ఎ లాట్'' అంటున్నాడు.

"ఇందులో నాదేం లేదు. అంతసేపు కాంప్లికేషన్సు లేకుండా ఎనిస్తీషియా మెయింటైన్ చేసినందుకు ఎనస్తసిస్టుని మెచ్చుకోవాలి'' అంటున్నాడు నీలమణి.

అవును. అది నీలమణి పద్ధతి.

నన్ను చూడగానే నీలమణి ముఖం వెలిగింది.

గబగబా వచ్చి నన్ను కౌగలించుకున్నాడు.

"థాంక్యూ బ్రదర్, థాంక్యూ నా మాట కాదనకుండా వచ్చావ్'' అన్నాడు.

వెంటనే వాళ్ళకేసి తిరిగి "డియర్ ఫ్రెండ్స్! క్షమించాలి. నాకు గెస్టు వచ్చాడు. ఇతన్ని ఇంటి దగ్గర దింపి వస్తాను'' అంటూ "రా రారా...'' అని నన్ను లాక్కుపోయాడు.

నీలమణి మేఘాల మీద తేలుతున్నట్టుగా నడుస్తున్నాడు.

బయటకు వచ్చి కారు ఎక్కే వరకు అతను ఏం మాట్లాడుతున్నాడో నా కర్థం కాలేదు. అతనిక్కడ ఏం మాట్లాడుతున్నాడో తెలిసి మాట్లాడుతున్నా డనుకోను.

కారు డ్రైవ్ చేస్తూ నా కేసి చూసి నవ్వాడు. ఆ నవ్వు చిన్న పిల్లాడి నవ్వులా ఉంది.

"ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు. నీరజని, ఆమె అందాన్ని నేను ఎంత ఆరాధించానో నీకు తెలుసు. నేను శిల్పిని కానందుకు, ఆమె అందాన్ని ఒక శిల్పంలో చిత్రించలేనందుకూ నేనెంతో విచారించే వాణ్ని. కాని ఈ వేళ నేను ఏ శిల్పైనా చేసే పనే చేశాను. ఆమె అందాన్ని తిరిగి పునర్ ప్రతిష్ఠ చేశాను. నా జీవితం ధన్యమయింది. నే నింక చచ్చిపోయినా ఫర్వాలేదు'' అతని కంఠం వణుకుతోంది. అతని కన్నుల్లో వింత కాంతి — దైవదర్శనం అయిన భక్తుడిలా ఉన్నాడు.

కారు రోడ్డు మీద సాఫీగా పోతోంది.

నా కెందుకో నీరజమీద జాలి వేసింది. ఆమె మణిలాటి నీలమణిని మామూలు గాజుముక్కనుకుని వదిలేసింది.

నీలమణి నవ్వుతూ ఏదో చెబుతున్నాడు.

మరోసారి అంటున్నాను. "నీలమణి అందరిలాంటి వాడు కాడు'' అని. ★



రేఖలలో చిత్రం— రంగనాయగమ్మ